సర్కారీ బడి.. నూతన సవ్వడి

- వైఎస్సార్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యా వసతులు మెరుగు
- నాడు అద్దె గృహంలో అవస్థల మధ్య బోధన
- నేడు సకల సౌకర్యాలు
- గణనీయంగా పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య



నాడు: తాత్కాలిక భవనంలో వైఎస్సార్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల



నేడు: సర్వాంగ సుందరంగా పాఠశాల భవనం

నెల్లూరు రూరల్: ప్రభుత్వ చర్యలతో పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందుతోంది. నాడు – నేడు ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం.. మెరుగైన విద్యాబోధన.. సకల సౌకర్యాలను కల్పించడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య నానాటికీ అధికమవుతోంది. నగర సమీపంలోని వైఎస్సార్‌నగర్‌లో గల ప్రాథమిక పాఠశాల దీనికి చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది.

ఇదీ గతం..

నగరానికి కూతవేటు దూరంలో ఉన్న వైఎస్సార్‌నగర్‌లో విద్య ఆ ప్రాంత వాసులకు గతంలో కలగా ఉండేది. ఏడేళ్ల క్రితం అప్పటి అధికారులు ఈ ప్రాంతంలో జనావాసాలకు శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో నామమాత్రంగా చిన్నపాటి పక్కా గృహంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఇరుకైన గదిలో నేలపై విద్యార్థుల చదువులు మొక్కుబడిగా సాగేవి. అనంతరం పాఠశాలను ఖాళీ చేయాలని సదరు భవన యజమాని చెప్పడంతో సమీపంలోని మరో అద్దె గృహంలోకి దాతల సహకారంతో తరలించారు. ఇద్దరు ఉపాధ్యాయులతో నామమాత్రంగా విద్యాబోధన జరిగేది. దీంతో ప్రభుత్వ పాఠశాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనాసక్తి చూపేవారు. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన ప్రజలు తమ పిల్లల చదువుల కోసం స్తోమతకు మించి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేవారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య స్వల్పంగా ఉండేది.

ప్రైవేట్ స్కూళ్లకు బై..బై..!

కార్పొరేట్‌కు దీటుగా ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలను కల్పించారు. ఫలితంగా ప్రైవేట్ స్కూళ్లకు తమ పిల్లలను పంపడాన్ని పలువురు స్వస్తి పలికారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలో చేరే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. గత ప్రభుత్వ హయాంలో ఈ పాఠశాలలో 25 నుంచి 60 మంది వరకే చదువుకునేవారు. ఒకరిద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండేవారు. గత విద్యా సంవత్సర ప్రారంభంలో దాదాపు 250 మంది ఈ పాఠశాలలో చేరారు. ప్రస్తుతం ఇక్కడ ఆరుగురు ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్నారు. రానున్న విద్యాసంవత్సరంలో 300 మందికిపైగా విద్యార్థులు చేరే అవకాశం ఉందని ఉపాధ్యాయులు అంచనా వేస్తున్నారు. విద్యాపరంగా వసతులు మెరుగుపడటంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు కళకళ

అప్పట్లో వెయ్యి కుటుంబాలు నివసించే ఈ ప్రాంతంలో ప్రస్తుతం నాలుగు వేల వరకు కుటుంబాలు ఉంటున్నాయి. ఈ క్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ ప్రాంతంలోని పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. నాడు – నేడు పథకం ద్వారా పాఠశాలకు అవసరమైన అన్ని వసతులను కల్పించారు. పాఠశాల అభివృద్ధికి మొదటి విడతలో రూ.28 లక్షలను మంజూరు చేశారు. ఈ నిధులతో మూడు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణం, నిరంతర నీటి వసతి, ఇంగ్లిష్ ల్యాబ్, విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. రెండో విడతలో మంజూరైన రూ.60 లక్షలతో ఐదు తరగతి గదుల నిర్మాణాన్ని చేపడుతున్నారు. ప్రతి తరగతి గదిలో విద్యార్థులకు సౌకర్యంగా ఫ్యాన్లు, ఆహ్లాదకర వాతావరణంతో చక్కటి వాల్ పెయింటింగ్‌ను తీర్చిదిద్దారు.



రెండో విడతలో జరుగుతున్న పనులు



- ఈ చిత్రంలోని వ్యక్తి నాగేంద్రబాబు నెల్లూరు రూరల్ పరిధిలోని వైఎస్సార్‌నగర్‌లో నివసిస్తున్నారు. బేల్దారి మేస్త్రీగా జీవనం సాగిస్తున్నారు. ఈయన కుమారుడు శివకుమార్ ఇక్కడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నారు. కార్పొరేట్‌కు దీటుగా వసతులు, విద్యాబోధన ఉండటంతో తన కుమారుడి భవిష్యత్తు ఎంతో బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



- ఈ ఫొటోలోని మహిళ సంధ్యారాణి వైఎస్సార్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈమె కుమారుడు శ్రీహరికుమార్ ఇక్కడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నారు. విశాలమైన గదుల్లో విద్యాబోధన.. చక్కటి వసతులు ఉండటంతో కార్పొరేట్ విద్య అందుతోందని ఆమె ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాడు - నేడుతో వసతులు మెరుగుపడ్డాయి



నాడు – నేడుతో పాఠశాల ఎంతో అభివృద్ధి చెందింది. దీంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. గతంలో ఇరుకైన అద్దె గదిలో విద్యా బోధన ఇబ్బందికరంగా ఉండేది. ప్రస్తుతం విద్యార్థులకు అనువుగా బోధన జరుగుతోంది. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు పాఠశాలలో ప్రస్తుతం ఉన్నాయి.

– రామ్మోహన్, ఉపాధ్యాయుడు, వైఎస్సార్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

ఎంతో అభివృద్ధి చెందింది



నాడు – నేడు ద్వారా వైఎస్సార్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాల ఎంతో అభివృద్ధి చెందింది. విద్యార్థులకు అవసరమైన వసతులతో పాటు చక్కటి విద్యా బోధనను అందిస్తున్నాం. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకూ సౌకర్యాలు ఏర్పడ్డాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రస్తుతం ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారు.

– చంద్రకళ, ప్రధానోపాధ్యాయురాలు

క్లుప్తంగా

ఏపీయూడబ్ల్యూజే నూతన కమిటీ ఏర్పాటు



నెల్లూరు(మినీబైపాస్): ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని సంస్థ అధ్యక్షుడు రమేష్‌బాబు పేర్కొన్నారు. నూతన కార్యవర్గ సమావేశాన్ని నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి ఖాజా మాట్లాడారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు. ప్రింట్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులతో కలిసి మంత్రిని మరోసారి కలుస్తామని తెలిపారు. గౌరవాధ్యక్షుడు రాజేష్, గౌరవ సలహాదారుడు దేవకుమార్ పాల్గొన్నారు.

రక్తదానం



నెల్లూరు (అర్బన్): రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యుడు ప్రవీణ్‌కృష్ణ 30వసారి రక్తదానం చేశారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో ఓ నెగటివ్ గ్రూపు రక్తాన్ని దానం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కమిటీ సభ్యుడు మలిరెడ్డి కోటారెడ్డి సూచనల మేరకు రక్తదానం చేశానని తెలిపారు. బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ‘పరిణయ’ వస్త్ర ప్రదర్శన



నెల్లూరు(బారకాసు): నగరంలోని స్వర్ణ వేదిక కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న పరిణయ వస్త్ర ప్రదర్శన పలువుర్ని ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా నిర్వాహకుడు టీవీ రావు మాట్లాడారు. దేశంలోని వివిధ రాష్ట్రాల చేనేతకారులు, డిజైనర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రదర్శనలో ఫ్యాషన్ ప్రియులు, మగువలు తమకు కావాల్సినవి కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. దేశంలో ఎంతో పేరు గాంచిన ఉప్పాడ, కళంకారీ, మంగళగిరి, ప్రింట్, సిల్క్, కాటన్ చీరలు, కశ్మీర్ సిల్క్, వన్‌గ్రామ్ జ్యువెలరీ, తదితరాలు అందుబాటు ధరల్లో లభిస్తున్నాయని వివరించారు. ప్రదర్శన ఆదివారంతో ముగియనుందని పేర్కొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



నెల్లూరు(బారకాసు): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. నగరంలోని 7 / 1, 2, 3 అరుణాచలం వీధి, రైతుబజార్ రోడ్డు, జయప్రకాష్‌వీధి వార్డు సచివాలయాలను శనివారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రికార్డులను సక్రమంగా నిర్వహించడంలేదని గుర్తించి, సంబంధిత కార్యదర్శికి షోకాజ్ నోటీస్‌ను జారీ చేయాలని ఆదేశించారు. ఇష్టం లేకపోతే ఉద్యోగాన్ని మానేయాలని.. ఉద్యోగాల్లేక అనేక మంది ఉన్నారని.. వారికైనా అవకాశం కల్పించొచ్చని చెప్పారు.

- 29వ డివిజన్లోని గాంధీనగర్‌లో గల పలు ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, చెత్త పేరుకుపోయిందని, దీనికి కారణమైన సంబంధిత సచివాలయ శానిటేషన్ కార్యదర్శిపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటింటి చెత్త సేకరణ పనులను ఆయన పరిశీలించారు. ఎంహెచ్‌ఓ వెంకటరమణ పాల్గొన్నారు.

రైలు ప్రమాదంపై ఎమ్మెల్యే మేకపాటి దిగ్భ్రాంతి

నెల్లూరు(దర్గామిట్ట): ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం జరిగి సుమారు 200 మందికిపైగా మృతి చెందడంపై ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కలెక్టర్ హరినారాయణన్ తన క్యాంప్ కార్యాలయంలో 0861 – 2331261 నంబర్‌ను ఏర్పాటు చేశారని, ప్రమాదంలో జిల్లాకు సంబంధించిన వారు ఎవరైనా ఉంటే తక్షణమే నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు.

వెటర్నరీ అసిస్టెంట్లతో సమావేశం

నెల్లూరు(పొగతోట): రైతు భరోసా కేంద్రాల పరిధిలో ప్రభుత్వ కార్యక్రమాలు పక్కాగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని పశుసంవర్ధక శాఖ జేడీ మహేశ్వరుడు సూచించారు. పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్లు, సర్జన్లు, ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులతో సమావేశాన్ని జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ డీడీ సురేష్‌బాబు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవికుమార్, డీఎల్డీఏ ఈడీ సోమయ్య, ఏడీ చైతన్యకిషోర్, అరుణ, రసూల్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(పొగతోట): రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ తహసీల్దార్లతో సమావేశాన్ని నగరంలోని జెడ్పీ కార్యాలయంలో కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్‌తో కలిసి మంత్రి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటించానని, ఈ క్రమంలో రెవెన్యూకు సంబంధించిన సమస్యలు తన దృష్టికి అధికంగా వచ్చాయని చెప్పారు. అసైన్డ్ భూములకు సంబంధించి పార్టీలతో సంబంధం లేకుండా భూమిపై ఉన్నవారు.. సాగు చేసుకునే వారికి పట్టాలను నిబంధనల మేరకు ఇవ్వాలని సూచించారు. అసైన్డ్, ఇనామ్ భూముల విషయంలో అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. నీటిపారుదల భూముల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని, మిగిలిన చుక్కల భూముల విషయంలో అధిక ప్రాధాన్యమిచ్చి ప్రతిపాదనలను పంపాలన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టకుండా భూములకు నష్టపరిహారాన్ని చెల్లించాలని సూచించారు. పక్క గ్రామాల్లో ఇచ్చిన రేట్లను దృష్టిలో ఉంచుకొని పరిసర గ్రామాల రైతులనూ అనువుగా ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే ఆ ప్రభావం ప్రజాప్రతినిధులు, ప్రభుత్వంపై పడుతుందని, చేయగలిన పనులను త్వరగా పరిష్కరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఉండే పనులు చేయమని తాను అడగబోనని స్పష్టం చేశారు. కాగా మంత్రి సూచనల మేరకు రెవెన్యూ సమస్యలపై ప్రతిపాదనలను తన కార్యాలయానికి నెల్లో పంపాల్సిందిగా తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. నీటి, డొంక, వాగు పొరంబోకు భూములను మినహాయించి మిగిలిన వాటికి ప్రతిపాదనలను పంపాలని తెలిపారు. ఆర్డీఓ మలోల, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వైఎంసీఏ, డీఆర్డీఏ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని టౌన్‌హాల్ సెక్షన్ ఏఈ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీ కూరగాయల మార్కెట్, పెద్దబజార్, చిన్నబజార్, కలెక్టర్ కార్యాలయం, రాయాజీవీధి, చాకలివీధి, ఆచారివీధి, కాపువీధి, ట్రంక్‌రోడ్డు, వీఆర్సీ సెంటర్, కాంప్లెక్స్ రోడ్డు, సోమశేఖరపురం, పొగతోట, బృందావనం, సండే మార్కెట్, సుబేదారుపేట, తదితర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- డైకస్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ లైన్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో మూలాపేట, ఫతేఖాన్‌పేట, రైతుబజార్, టెక్కేమిట్ట, సరస్వతీనగర్, క్రాంతినగర్, రామ్‌నగర్, పాత మిలటరీ కాలనీ, అరవింద్‌నగర్, శోధన్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని నెల్లూరు వెస్ట్ – 1 ఏఈ లక్ష్మీబాయి పేర్కొన్నారు.
- రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ లైన్లను ఏర్పాటు చేయనున్న తరుణంలో గుప్తా పార్క్, సంతపేట, గోపీ టీ సెంటర్, తూకుమానుమిట్ట, బ్రాహ్మణవీధి, ములుమూడి బస్టాండ్, చిన్నబజార్, అగ్నిపేట, కోటమిట్ట, కుక్కలగుంట, గిడ్డంగివీధి, పాత మున్సిపల్, డీఎంహెచ్‌ఓ కార్యాలయ ప్రాంతాలు, పరమేశ్వరినగర్, మనుమసిద్ధినగర్, శివగిరి కాలనీ, పుత్తా ఎస్టేట్స్, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని వెస్ట్ – 2 ఏఈ గోపీ తెలిపారు.

క్రీడాకారులకు పౌష్టికాహార పంపిణీ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ద్వారా శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడారు. స్టేడియంలో దాదాపు 800 మంది క్రీడాకారులు వివిధ అంశాల్లో శిక్షణ పొందుతుండటం అభినందనీయమన్నారు. అనంతరం అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తిరుపతి నాయుడు మాట్లాడారు. అసోసియేషన్ సభ్యులు రామచంద్రరాజు, వెంకటరెడ్డి సౌజన్యంతో పౌష్టికాహారాన్ని అందజేశామని చెప్పారు. అసోసియేషన్ అధ్యక్షుడు కనకట్ల రఘురామ్ ముదిరాజ్, మాజీ అధ్యక్షుడు శేషగిరిరావు, కోశాధికారి రామారావు, నేతలు రంగారావు, సాయికుమార్, నిర్మల నరసింహారెడ్డి, రమణయ్య, ప్రసాద్‌బాబు, డాక్టర్ శ్రీనివాస్ కుమార్, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దొంగల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిని కత్తితో బెదిరించి అతని జేబులోని నగదు, సెల్‌ఫోన్‌ను దోచుకెళ్లిన ఘటనలో నలుగురు దొంగలను చిన్నబజార్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఏఎస్‌పేట మండలం జమ్మవరానికి చెందిన హజరత్తయ్య కృష్ణపట్నం పోర్టులో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ రాత్రి ఆయన పనులు ముగించుకొని ముత్తుకూరు బస్టాండ్‌కు వచ్చి.. అక్కడి నుంచి ఎం – 2 థియేటర్స్ రోడ్డు మీదుగా ఆత్మకూరు బస్టాండ్‌కు నడుచుకొని బయల్దేరారు. రాఘవేంద్ర స్కానింగ్ సెంటర్ వద్దకు వచ్చేసరికి ఓ యువకుడు, ముగ్గురు మహిళలు అతడ్ని అడ్డుకొని కత్తితో బెదిరించారు. హజరత్తయ్య జేబులోని రూ.రెండు వేల నగదు, సెల్‌ఫోన్‌ను దోచుకెళ్లారు. ఘటనపై చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబుకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు ఎస్సై లతీఫున్నీసా కేసు నమోదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాలు, సీసీ కెమెరాలు, సాంకేతికత ఆధారంగా నిందితులు బీవీనగర్ ఉప్పుకలవారివీధికి చెందిన గౌతమ్ స్వరూప్, చంద్రబాబునగర్ బీ బ్లాక్‌కు చెందిన చంద్ర అలియాస్ చంద్రమ్మ, బుజబుజనెల్లూరు శివాజీకాలనీకి చెందిన ముత్యాలు అలియాస్ ముత్యాలమ్మ, నాగమ్మ కాలనీకి చెందిన కామాక్షిగా గుర్తించి వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో రెడ్‌క్రాస్ సమీపంలో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి సెల్‌ఫోన్, రూ.400 నగదు, నేరానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ



నెల్లూరు (అర్బన్): ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోటమిట్ట పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి సైకిల్ ర్యాలీని వైద్య శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ర్యాలీని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్ ప్రారంభించారు. డాక్టర్లు సుధీర్‌కుమార్, హరిశ్చంద్రసతీష్, అనిల్, బ్రహ్మేశ్వర్, డెమో అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



నెల్లూరు(మినీబైపాస్): నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట, మహాకుంభాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు చేశారు. ముఖ్య అతిథిగా నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ హాజరయ్యారు. చైర్మన్ వంగాల శ్రీనివాసులు రెడ్డి, ఈఓ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

వేడుకగా చండీ హోమం



నెల్లూరు(మినీబైపాస్): మూలాపేటలోని శంకరమఠంలో చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఉభయకర్తలుగా బాలగంగాధర్‌రావు దంపతులు వ్యవహరించారు.

ప్రతిభ పురస్కారాల ప్రదానం నేడు

నెల్లూరు (వేదాయపాళెం): పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ చూపిన దేవాంగ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను నగరంలోని పురమందిరంలో ఆదివారం ఉదయం పది గంటలకు అందజేయనున్నామని దేవాంగ సంక్షేమ సంఘ జిల్లా నేత పముజుల శంకరయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

- పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన గాండ్ల, తెలికుల విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను నగరంలోని దేవిశెట్టి స్వాములు కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 11 గంటలకు అందజేయనున్నామని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు తెలిపారు. పదో తరగతి, సీనియర్ ఇంటర్‌లో జిల్లా టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, నగదు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు, జ్ఞాపికలను సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు గ్రోసు గోపాలయ్య పేరిట అందజేయనున్నామని పేర్కొన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలకు

నెల్లూరు(టౌన్): విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జిల్లా వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి శేఖర్ పేర్కొన్నారు. వీఆర్ కళాశాలలో నిర్వహించిన విద్యార్థులు, అధ్యాపకుల సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ప్రిన్సిపల్ జయచంద్రబాబు, ఏఓ మధుసూదన్‌శర్మ, కార్యనిర్వాహకులు సుప్రజారాణి, వైష్ణవి, ఝాన్సీ, ధనూష, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్, రవీంద్రరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోపు సమస్యలకు పరిష్కారం

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రజలు తెలియజేసిన రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లతో ప్రత్యేక సమీక్షను ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఆర్డీఓ కరుణకుమారితో కలిసి నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు రెవెన్యూ సమస్యలను తన దృష్టికి అధికంగా తీసుకొస్తున్నారని, వీటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని సూచించారు. సచివాలయ పరిధిలోని వీఆర్వోలు ప్రతి రెవెన్యూ సమస్యను నమోదు చేసేలా తహసీల్దార్లు చర్యలు చేపట్టాలని చెప్పారు. సమస్యలను నమోదు చేసి జాబితాలను రూపొందించి పది రోజుల్లో తనకు అందించాలని సూచించారు. అనంతసాగరం, మర్రిపాడు మండలాల్లో కలెక్టర్ హరినారాయణన్ శుక్రవారం పర్యటించారని, పలు సమస్యలను ఇప్పటికే ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. కొమ్మలేరు మీడియం డ్రెయిన్ వెడల్పు కోసం శంకరనగరం, మినగల్లు, కొత్తపల్లి గ్రామాలకు చెందిన రైతులు భూములను అందజేశారని, వీరికి నష్టపరిహారాన్ని చెల్లించేలా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో అసైన్డ్ పట్టాల పంపిణీ పారదర్శకంగా సాగాలని పేర్కొన్నారు. అర్హత కలిగి భూమి లేని ప్రతి నిరుపేదకూ అసైన్‌మెంట్ ద్వారా భూమిని అందించేలా అధికారులు జాబితాలను సిద్ధం చేయాలని కోరారు. నియోజకవర్గంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలను మంజూరు చేసేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు.

దేవదాయ శాఖ ఏసీగా శ్రీనివాసరావు



నెల్లూరు(మినీబైపాస్): దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా శ్రీనివాసరావు బాధ్యతలను శనివారం స్వీకరించారు. పెదకాకానిలో ఎండోమెంట్ ట్రిబ్యునల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు రెడ్డిని ప్రకాశం జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు.

మిత్రాకు గౌరవ డాక్టరేట్



నెల్లూరు(మినీబైపాస్): విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత వైటీ మిత్రాకు గౌరవ డాక్టరేట్‌ను బాప్టిస్ట్ చర్చి డానీ హాల్ ఇంగ్లిష్ సర్వీస్ ఆధ్వర్యంలో ప్రదానం చేశారు. వీఆర్సీ సెంటర్‌లోని బాప్టిస్ట్ చర్చిలో ఇంగ్లిష్ సర్వీస్ చాప్లిన్ రెవరెండ్ డెవిడ్ లివింగ్‌స్టన్ అధ్యక్షతన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం మిత్రా ఆత్మకథ డ్రీమ్స్ రియలైజ్డ్ పుస్తకాన్ని సర్వోదయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ రెవరెండ్ డాక్టర్ నిర్మల్‌కుమార్, నల్లగొండ డిప్యూటీ కలెక్టర్ ఆనందరావు ఆవిష్కరించారు. రెవరెండ్ హ్యారీపాల్ వాక్యోపదేశం చేశారు. డాక్టర్ రాజకుమారి, జయకుమార్, అసిస్టెంట్ కమిషనర్ సీజీఎస్టీ ఉషాకిరణ్‌రాయ్, విశ్రాంత అధ్యాపకులు రెవరెండ్ మణిరావు, జొనాథన్ పాల్గొన్నారు.

8న శాంతి ర్యాలీ

నెల్లూరు(మినీబైపాస్): క్రైస్తవ సంస్థలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శాంతి ర్యాలీని ఈ నెల 8న చేపట్టనున్నామని నెల్లూరు ఆర్సీఎం బిషప్ ప్రకాశం పేర్కొన్నారు. సుబేదారుపేటలోని బిషప్ హౌస్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫాదర్ జోసఫ్, రెవరెండ్ రాజశేఖర్ దాసరి, సురేంద్రబాబు, బర్నబాస్, స్వామిదాస్, పాస్టర్లు హనోక్, రాఘవ మోజెస్, ప్రభుకుమార్, సుదర్శనరాజు, మధు, తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం

నెల్లూరు సిటీ: ఆర్టీసీ నెల్లూరు రెండో డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు, సలహాలను తెలుసుకునేందుకు గానూ డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నామని మేనేజర్ శివకేశవ్‌యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల్లోపు 99592 25642 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

‘జగనన్నకు చెబుదాం’పై రేపట్నుంచి స్పందన

నెల్లూరు రూరల్: ‘జగనన్నకు చెబుదాం’పై స్పందన కార్యక్రమాన్ని నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఈ నెల ఐదు నుంచి ప్రతి సోమవారం నిర్వహించనున్నామని ఆర్డీఓ మలోల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.